ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.4 ၊ కనిష్ఠం 24.8





మాట్లాడుతున్న వెంకట్రామ్‌రెడ్డి

సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రైతులు నెమ్మదిగా సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించుకోవాలని ఉద్యానవన శాఖ మాజీ సంచాలకులు వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో భారత ప్రభుత్వం యొక్క సేంద్రియ, సహజ వ్యవసాయ ప్రాంతీయ కేంద్రం నాగ్‌పూర్ ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ తెలంగాణ ప్రభుత్వం సేంద్రియ, సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణతో పాటు క్షేత్ర ప్రదర్శనపై ఒక్కరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలో ఏర్పాటయ్యే జిల్లా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లో రైతులు ఆసక్తి చూపించి సభ్యత్వం తీసుకోవాలని అంచెలంచెలుగా ఎఫ్‌పీవోను అభివృద్ధి చేసి జిల్లా రైతులను ఆరోగ్యంగా ఆర్థికంగా అభివృద్ధి పర్చాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎఫ్‌పీవో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా రైతులకు మరెన్నో శిక్షణ, క్షేత్రస్థాయి కార్యక్రమాలు నిర్వహించి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉద్యానవన శాఖ సహాయ సంచాలకుడు చక్రపాణి మాట్లాడుతూ.. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ గురించి వివరించారు. త్వరలో జిల్లాలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ నియోజకవర్గ రైతులతో ఈ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి రైతులకు మార్కెట్ డైరెక్ట్ లింకేజీ విధానంలో పంటలు అమ్మేలాగా ఎఫ్‌పీవో ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కేంద్రం శాస్త్రవేత్త ప్రవీణ్, శ్రీనివాస్, సాయిబాబా, నర్సయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కేటాయింపుల వ్యవహారంలో కీలక మలుపు

- జిల్లాలో మూడేళ్ల క్రితం కేటాయించిన ధాన్యం రికవరీకి అధికారుల యత్నాలు
- 44 మిల్లులకు నోటీసుల జారీ
- మిల్లుల నుంచి రూ.250 కోట్ల రికవరీకి ప్రయత్నాలు చేస్తున్న అధికారులు
- వర్ని పోలీసు స్టేషన్‌లో ముగ్గురు అధికారులపై ఫోర్జరీ కేసు నమోదు

నిజామాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కేటాయింపుల వ్యవహారం కీలక మలుపు తిరుగుతోంది. మూడేళ్ల క్రితం కేటాయింపులు చేసిన ధాన్యం పక్కదారి పట్టిన వైనంపై మిల్లర్లపై చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అప్పటి అధికారులపై కూడా చర్యలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై 44 మిల్లులకు నోటీసులు జారీ చేయడంతో పాటు కొన్ని మిల్లుల యజమానులపై కేసులను నమోదు చేశారు. ఆర్ఆర్ యాక్ట్ కింద రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ధాన్యం కేటాయింపులు చేసిన కస్టం మిల్లింగ్ కింద బియ్యం ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి సంవత్సరం కాలంగా ధాన్యాన్ని కేటాయించడం లేదు. ఈ వ్యవహారంలో అప్పటి అసోసియేషన్ పెద్దలతో పాటు అధికారుల సహకారం ఉండటంతో ఆ కోణంలో దర్యాప్తును కొనసాగిస్తున్నారు. కీలకమైన చర్యలను తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కేటాయింపులో ఫోర్జరీ కేసు కింద అప్పటి అధికారులపై వర్ని పోలీస్ స్టేషన్‌లో కేసులను కూడా నమోదు చేశారు. ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతో పాటు రికవరీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు కూడా ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా రికవరీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అవసరమైతే మిల్లుల ఆస్తులను కూడా జప్తు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రతీ సీజన్‌లో మిల్లులకు కేటాయింపులు

జిల్లాలో రెండు సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రతీ సీజన్‌లో మిల్లులకు కేటాయింపులు చేస్తున్నారు. ఆ కేటాయింపులకు అనుగుణంగా కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని ఇవ్వాలని ఆదేశాలు ఇస్తున్నారు. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందిస్తున్నారు. జిల్లాలో సహకార సంఘాలు, మహిళా సంఘాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లుల కెపాసిటీకి అనుగుణంగా ఈ కేటాయింపులను చేస్తున్నారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో రబీ, ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం కేటాయింపులు చేశారు. ఈ కేటాయింపులు చేసిన మిల్లుల్లో ధాన్యంకు అనుగు ణంగా బియ్యాన్ని అందించలేదు. అధికారులు తనిఖీలు చేపట్టగా మిల్లుల్లో ధాన్యం కూడా లేదు. అధికా రులు కేటాయింపులు చేసిన ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. మిల్లింగ్ చేసి బియ్యాన్ని అమ్మకాలు చేసినట్లు గుర్తించారు. జిల్లాలోని 44 మిల్లులలో ఈ అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. వీటిలో మాజీ ఎమ్మెల్యేకు సంబంధించిన మిల్లులే ఎక్కువగా ఉన్నాయి. ఈ మిల్లులకు సుమారు రూ.120 కోట్లకు పైగా ధాన్యం కేటాయింపులు చేసినా రికవరీ కాలేదు. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 44 మిల్లులకు రూ.254 కోట్ల ధాన్యాన్ని కేటాయింపులు చేశారు. మూడేళ్ల తర్వాత కూడా కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని ఇవ్వకపోవడంతో ఈ మిల్లులకు నోటీసులను జారీ చేశారు. కొన్ని మిల్లుల యజమానులపై అధికారులు కేసులను కూడా పెట్టారు. కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని కేటాయించాలని కోరారు. ధాన్యం నిల్వలు లేకపోవడంతో పాటు నిర్దిష్ట గడువు ఇచ్చినా బియ్యాన్ని ఇవ్వకపోవడంతో కొన్ని మిల్లులపై ఆర్ఆర్ యాక్ట్ కింద కేసులను నమోదు చేశారు. అధికారుల ఒత్తిళ్ల మేరకు నాల్గున్నర కోట్ల రూపాయలు కొన్ని మిల్లుల యజమానులు చెల్లించారు. మిగతా వారు ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా బియ్యాన్ని ఇవ్వలేదు. ఈ మిల్లుల నుంచి రికవరీ చేసేందుకు అధికారులు చర్యలను చేపడుతున్నారు. ఈ వ్యవహారంలో అప్పటి డీఎస్‌వోను కూడా ఇక్కడి నుంచి బదిలీ చేశారు. శాఖపరమైన చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు బియ్యం కస్టం మిల్లింగ్ కింద పెట్టాలని ఒత్తిళ్లు తెచ్చిన ఫలితం లేకపోవడంతో ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలకు సిద్ధమవుతున్నారు. మూడేళ్ల క్రితం ధాన్యం కేటాయింపుల సమయంలో అప్పటి అధికారులతో పాటు మిల్లర్లు చక్రం తిప్పారు. జిల్లా అసోసియేషన్‌లో కీలకపాత్ర పోషించిన నేతలు ఒత్తిళ్లతో ఎక్కువగా కేటాయింపులను చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రమేయంతో అప్పటి అధికారులు ఆయన మిల్లులకు ఎక్కువ మొత్తంలో ఈ ధాన్యం కేటాయింపులు చేసినట్లు విజిలెన్స్ అధికారుల తనిఖీలో గుర్తించారు. వారి ఆదేశాలకు అనుగుణంగానే కేసులను నమోదు చేశారు. ఇవేకాకుండా వర్నికి చెందిన ఒక మిల్లుకు ధాన్యం కేటాయించకుండానే ఆ యజమాని సంతకాన్ని ఫోర్జరీ చేసి కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని ఇవ్వాలని నోటీసులను జారీ చేశారు. ఈ వ్యవహారంలో ఆ యజమాని హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు వర్ని పోలీస్ స్టేషన్‌లో అప్పటి డీఎస్‌వో, డిప్యూటీ తహసీల్దార్, అదనపు కలెక్టర్ (సివిల్ సప్లయి)లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జిల్లాలో మూడేళ్ల క్రితం కేటాయించిన ధాన్యానికి సంబంధించి రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఇప్పటికే కొన్ని మిల్లులకు నోటీసులు ఇవ్వడంతో పాటు మరికొన్ని మిల్లులకు ఆర్ఆర్ యాక్ట్ కింద రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు.


తాగునీటి సమస్యను పరిష్కరించండి

- 14 నెలల నుంచి ఇక్కట్లు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- అవస్థలు పడుతున్న గ్రామస్థులు

7



ఇందల్వాయిలో ఖాళీ బకెట్లతో మహిళలు



ఘనంగా రంజాన్

- జిల్లాలోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు
- ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనాలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు
- వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్ల కార్డులు, నల్లబ్యాడ్జీలతో నిరసనలు

జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినాన్ని ఘనంగా జరుపుకొన్నారు. జిల్లాలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెలరోజులు ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు నెలవంక దర్శనం ఇవ్వడంతో ఉపవాసాలు విడిచి ఆనందోత్సహాలతో పండుగను జరుపుకున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా ఈద్గా ప్రాంతంలో జరిగిన ప్రార్థనలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీలు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

\- న్యూస్ నెట్‌వర్క్, నిజామాబాద్

(వివరాలు 6,7వ పేజీలలో...)



● నగరంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శెట్‌పల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం ఇలా..

శిథిలావస్థలో సహకార సంఘ భవనం

- భయాందోళనల మధ్య ఉద్యోగుల విధులు
- నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు
- పట్టించుకోని అధికారులు

7

కళావిహీనంగా అతిథి గృహం

- ఎండిపోయిన నిజాం సాగర్ వీఐపీ గార్డెన్
- ప్రభుత్వాలు మారుతున్నా కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు

7

సిద్ధరామేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి



ఈ నెల 8 వరకే.. ఆయకట్టుకు సాగునీరు

- ఎస్సారెస్పీలో తగ్గుతున్న నీటి నిల్వలు
- ఉన్న నిల్వలు తాగునీటి అవసరాలకు వినియోగం
- రైతులు పొదుపుగా వినియోగించుకోవాలంటున్న ప్రాజెక్టు అధికారులు

నిజామాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్సారెస్పీ నుంచి ఆయకట్టుకు చివరి తడిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ నెల 8 వరకు మాత్రమే నీటిని విడుదల చేయనున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టాలు తగ్గుతుండటంతో ఉన్న నీటిని తాగునీటి కోసం వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. శివం కమిటీలో తీసుకున్న నిర్ణయం ఆధారంగా కాకతీయ, లక్ష్మి, సరస్వతీ కాలువలతో పాటు గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకం కింద ఈ నీటిని విడుదల చేస్తున్నారు. పంటలు కూడా వెనకకు వస్తుండటంతో చివరి ఆయకట్టుకు సాగునీరును అందించేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు కూడా పొదుపుగా నీటిని వినియోగించు కోవాలని ఎస్సారెస్పీ అధికారులు కోరుతు న్నారు.

గణనీయంగా తగ్గిన నీటి మట్టం

ఎస్సారెస్పీలో నీటి మట్టాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1065.40 అడుగుల నీటి మట్టాలు ఉన్నాయి. ప్రాజెక్టులో 80 టీఎంసీలకు గాను 16.544 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టుల నుంచి యాసంగికి సాగునీటిని విడుదల చేస్తున్నారు. గత డిసెంబర్ 25 నుంచి ఈ నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ పరిధిలోని ఆయకట్టుకు ఎల్ఎండీ ఎగువన నాల్గున్నర లక్షల ఎకరాలకు సాగునీరును అందిస్తున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల పరిధిలోని ఈ కాలువ ఆయకట్టుకు ఈ నీటివిడుదల కొనసాగిస్తున్నారు. జోన్-1, జోన్-2గా విభజించి ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. శివం కమిటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ కాలువ పరిధిలోని ఆయకట్టుకు ఈనెల 8 రాత్రి వరకు నీటి విడుదలను కొనసాగిస్తారు. కాక తీయ కాలువతో పాటు లక్ష్మి, సరస్వతీ, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలకు కూడా అదే రోజు వరకు నీటి విడుదలను కొనసాగిస్తారు. ప్రాజెక్టులో నీటిమట్టాలు తగ్గిపోవడం వల్ల అదనంగా రైతులు కోరిన ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. యాసంగి సాగు సమయంలోనే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా విడతల వారీగా నీటి విడుదలను కొన సాగిస్తున్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎస్సారెస్పీ అధికారులు సూచించారు. ఎల్ఎండీ ఎగువన ఎనిమిదిన్నర లక్షల ఎకరాలకు సాగునీరును అందించారు. ఈనెల 8 తర్వాత పంటలకు నీటివిడుదల ఉండదని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త తెలిపారు. ప్రాజెక్టులో నీళ్ల తగ్గడం వల్ల నీటి విడుదలను చేయలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఉన్న నీటి నిల్వలను నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల తాగునీటి కోసం విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించి పంటలకు పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.



ప్రార్థనలో పాల్గొన్న ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్, మత పెద్దలు

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ముత్యాల సునీల్ కుమార్

మోర్తాడ్, మార్చి31(ఆంధ్రజ్యోతి): భారత్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు మల్లికార్జున కార్గె, పార్లమెంట్ ప్రత్యక్ష నాయకులు రాహుల్ గాంధీ పిలుపు మేరకు ఏప్రిల్ 2 నుంచి పల్లె నుంచి డిల్లీ వరకు నిర్వాహించే జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో విలేకరులతో మాట్లాడారు. బాల్కొండ నియోజక వర్గంలో ఎమ్మెల్సీ బాల్మూరి వెంకట్ పర్యవేక్షణలో జరుగుతుందని అన్నారు. భారత దేశం విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటుందని, గత పదేళ్లకు పైగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ అప్రజాస్వామ్య పాలన సాగిస్తుందని ఆరోపించారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆదే శాలతో జిల్లాలో తొలిసారిగా బాల్కొండ నియోజక వర్గంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రజలంత స్వచ్చందంగా పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాల ని సునీల్‌కుమార్ కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ అధి కార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు ముత్యాల రాములు, సోమ దేవారెడ్డి, నర్సయ్య, ముత్యంరెడ్డి, వివిధ మండలంలో నాయకులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ఘనంగా పల్లకీ సేవ



ఆర్మూర్‌లో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలో పంచామృతాలతో, బిల్వా పత్రాలతో అభిషేకం చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో భజన మండల సభ్యులు, భక్తులు భక్తి గీతాలు పాడుతూ నృత్యాలు చేశారు. ప్రతీ సోమవారం అందించే అన్న ప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగె మల్లయ్య, చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, శ్రీనివాస్, ప్రశాంత్‌గౌడ్,సతీష్, ఆలిశెట్టి నరేష్, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు



ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసింది. సోమవారం ఆర్మూర్‌లో కాంగ్రెస్ పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి నిధుల మంజూరుకు సంబం దించిన ప్రొసీడింగ్ కాపీని ఆలూర్ మండల కాంగ్రెస్ నాయకులకు అందజేశారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నారు. నిధులు మంజూరు చేయించిన వినయ్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆలూర్ మండల కాం గ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, కొండ్రా శివకృష్ణ, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, గంగారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయుడు జంగం అశోక్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

వేల్పూర్ , మార్చి31(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాన్కం పేట్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జంగం అశోక్ గ్రామానికి చెందిన సేవలు అభినందనీయమని గ్రామస్థులు అన్నారు. సోమ వారం పదవీ విరమణ చేసిన అశోక్‌ను గ్రామస్థులు సన్మానించారు. చదుకుంటేనే భవిష్యత్ ఉంటుందని అందరు చదువుకోవాలని గ్రామ స్థులకుసూచించి వారిఅభివృద్ధి కోరుకునేవాడని గ్రామస్థులు పేర్కొ న్నారు.కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీఐ జంగం అశ్విన్ కుమార్,మాజీసర్పంచ్ సొడ రమేష్, సొసైటి మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సోమ నర్సింహారెడ్డి, సుదర్శన్, దేవనంద్, సొడ ప్రభా కర్, సొడ రవి, సునీల్‌రావ్, జువ్వాజి శంకర్, సొడ అరుణ్ రాజ్ పాల్గొన్నారు.

పోచారంలో జడకొప్పులాట

ఎడపల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామంలో ప్రతీ సంవత్సరం ఉగాది పర్వదినాన పాడిపంటలు బాగుండాలని పాటలు పాడుతూ జడకొప్పులాట నిర్వహిస్తామని గ్రామాభివృద్ధి అధ్యక్షులు అంజనీకుమార్ తెలిపారు. ఉగాది పర్వదినం రోజు జడకొప్పు వేస్తారని, మరుసటి రోజు పాటలు పాడుతూ జడకొప్పు విప్పడం జరుగుతుందన్నారు. అందులో భాగం గా సోమ వారం జడకొప్పు విప్పడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నరేందర్, లక్ష్మయ్య, గ్రామ ప్రజలు తాడెం ఇస్తారి, తాడెం ప్రదీప్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేడు బినోలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవీపేట,మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు తెలిపారు. ఉదయం 10గంటలకు బినోల సొసైటీ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

మోర్తాడ్ , మార్చి31(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండలం గాండ్లపేట్ శివారులో ఆదివారం రాత్రి లారీ బోల్తా పడింది. గుడివాడ నుంచి ఇండోర్‌కు మినుముల లోడ్‌తో వెళ్తున్న లారీ 63 వ జాతీయ రహదారి పక్కన గాండ్లపేట్ శివారులో మూలమలుపు వద్ద అదుపు తప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదని ఎస్సై విక్రం తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా రంజాన్ వేడుకలు



బోధన్‌లో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఆర్మూర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వినయ్‌రెడ్డి



బోధన్‌లో ఈద్గా వద్ద పోలీసు బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ సాయి చైతన్య

బోధన్‌రూరల్,మార్చి31(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మైనారిటీ సోదరులు ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు చేసి అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తరపున మైనారిటీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈద్గా కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

● ఈద్గా వద్ద పోలీసు బందోబస్తును పర్యవేక్షించిన సీపీ సాయి చైతన్య

బోధన్ పట్టణంలో రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం ఈద్గా వద్ద పోలీసుల బందోబస్తును సీపీ సాయి చైతన్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. రంజాన్, శ్రీరామ నవమి, హనుమాన్ శోభాయాత్రలను కులమతాలకు అతీతంగా అందరు కలిసి మెలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోన్నారు. ఆయన వెంట ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

నవీపేట: ముస్లిం సోదరుల పవిత్ర పండుగ రంజాన్ వేడుకలను సోమ వారం మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. నవీపేట, బినోల, నాళేశ్వర్, జన్నేపల్లి, నాడాపూర్, యంచ, నాగేపూర్ తదితర గ్రామాలల్లోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని అన్నిగ్రామాలలో సోమవారం రంజాన్ పండుగను ముస్లీంలు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఆయా గ్రామాలలో ఈద్గాల వద్దకు వెళ్ళి ముస్లీం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. జక్రాన్‌పల్లి, అర్గుల్, మునిపల్లి, పడకల్, బ్రాహ్మన్‌పల్లి, తొర్లి కొండ, కొలిప్యాక్, కలిగోట్, చింతలూర్ గ్రామాలలో ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లీంలకు వివిధ పార్టీల నాయకులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

భీమ్‌గల్‌టౌన్:ముస్లీంల పవిత్ర పండగ రంజాన్ వేడుకలను సోమవారం భీమ్‌గల్‌లో ఘనంగా నిర్వహించారు. బాపూజీ నగర్‌లో ఈద్గావద్ద ముస్లీంలు ప్రత్యేక ప్రార్దనలు చేశారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరై ముస్లీంలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే వెంట మండల నాయకులు నర్సయ్య,చౌట్‌పల్లిరవి,ఆర్మూర్‌మహేష్, భగత్,సురేష్ తదితరులు ఉన్నారు.

నందిపేట: మండలంలో సోమవారం ముస్లీంల పవిత్రపండగైన రంజాన్ ఘనంగా జరిగింది. ముస్లీంలు నూ తన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ, బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు వేర్వేరుగా ఇచ్చిన విందుకు పలువురు ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, అధికారులు, యువకులు హాజరైనారు.

ధర్పల్లి: మండలంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు సోమవారం భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సారిక హన్మంత్ రెడ్డి తెలిపారు.

మెండోర: పవిత్ర ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ పండుగను ముస్లీం సోదరులు సోమవారం ఘనంగా నిర్వహించారు.వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి ముస్లీంలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ఎస్ఐ నారాయణ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లీం మతపెద్దలు, ముస్లీంలు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో సోమవారం ముస్లీంలు రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాలలో ఈద్గా వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

మోస్రా:చందూర్, మోస్రా మండల కేంద్రాలతో పాటు మండలంలోని గ్రామాల్లో పవిత్రరంజాన్ పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు హిందూ సోదరులు ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

డిచ్‌పల్లి:రంజాన్ పర్వదినం పురష్కరించుకొని డిచ్‌పల్లి మండలంలోని ఈద్గాల వద్ద సోమవారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి వేడుకలు నిర్వహించుకున్నారు. రంజాన్ సందర్భంగా ఎలాంటి ఆవాంచనీయ ఘటనలుజరగకుండా పోలీసులుఈద్గాల వద్ద గట్టి భద్రత ఏర్పాట్లు నిర్వహించారు.

కమ్మర్‌పల్లి: మండల వ్యాప్తంగా ముస్లీంలు సోమవారం రంజాన్ ఈద్ వేడుకలను ఆనందోత్సహాలతో ఘనంగ జరుపుకున్నారు. ఉదయం 8 గంటలకు ఆయా గ్రామాల మజీద్‌ల వద్దకు చెరుకున్న ముస్లీం లు తక్బీర్ ఆలపిస్తూ గ్రామల శివారుల్లోని ఈద్గాలవద్దకు చేరుకుని పేష్ ఇమామ్ అద్వర్యంలో ఈద్-ఉల్-ఫితర్ సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఏర్గట్ల: రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లో ముస్లీంలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లీంలు ఈద్గా మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి ఈద్-ఉల్-ఫితర్ జరుపుకున్నారు. నాగేంద్ర నగర్ గ్రామంలో ముస్లీంలు నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ 2024 పార్లమెంట్‌లో ప్రవేశపెడతున్న నేపథ్యంలో బిల్లును అడ్డుకోవాలని, అది ఆమోదం పొందితే ముస్లీం సమాజానికి నష్టం జరుతుగుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం నెలవంక దర్శనం ఇవ్వడంతో ముస్లిం సోదరులు నెల రోజుల పాటు చేపట్టిన కఠిన ఉపవాస దీక్షలు విరమించారు. గ్రామాల సమీపంలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

పెర్కిట్:రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్మూర్ పట్టణంలోని ఈద్గాల వద్ద ముస్లీంలు ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఈద్గాకు చేరుకొని ప్రార్ధన ల అనంతరం ముస్లీంలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ చైర్మన్ సాయిబాబాగౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లింగగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాందేష్ శ్రీనివాస్, డీసీసీబీ డైరెక్టర్ వాసు, మాజీ కౌన్సిలర్లు వనం శేఖర్, రమేష్, మురళి, జంబిహానుమాన్ ఆలయ డైరెక్టర్ రమణ, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విజయ్, అజ్జు, జిమ్మి రవి, రవీందర్ రెడ్డి, భుపెందర్, సంతోష్ తదిరులు పాల్గొన్నారు.

సిరికొండ:రంజాన్ పండగా సందర్భంగా సిరికొండ మండలంలో మైనార్టీలు ఈద్గాలు, ప్రార్థణ మందిరాల్లో ఉదయం పదిన్నర గంటల కు ప్రార్థణలు చేశారు..పెద్దవాల్గోట్‌లో కిసాన్ ఖేత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాదరి నర్సారెడ్డి,ఇతర నాయకులతో కలిసి ఈద్గా వద్ద ప్రార్థణలు ముగియగానే సమాచరులను ఆలిగంనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వర్ని: వర్ని మండలంలో సోమవారం రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు.గ్రామాల్లో హిందూ సోదరులతో కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తేనేటితో పాటు పండ్లు అందజేసి విందును ఏర్పాటు చేశారు.

రెంజల్: మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గాం, సాటాపూర్, రెంజల్, వీరన్నగుట్ట, పేపర్‌మిల్, కందకుర్తి గ్రామాలలో సోమవారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ సాయన్న బందోబస్తును ఏర్పాటు చేశారు.

కోటగిరి: కోటగిరి మండలంలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం నెలవంక దర్శనం ఇవ్వడంతో ముస్లిం సోదరులు నెల రోజుల పాటు చేపట్టిన కఠిన ఉపవాస దీక్షలు విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టం మనోహర్, బర్ల మధు, షాహీద్, జుబేర్, బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

● పొతంగల్‌లో..

పొతంగల్ మండలంలో సోమవారం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏజాజ్ ఖాన్, నబీ, వహీద్, సిరాజ్, మన్సుర్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రూరులో..

రుద్రూరు మండలంలో సోమవారం రంజాన్ పండుగను ముస్లింసోదరులు ఘనంగా జరుపుకున్నారు. రుద్రూరు, సులేమాన్ నగర్, రాయకూర్ క్యాంప్, రాయకూర్, అంబం, అక్బర్‌నగర్ గ్రామాలలో ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారోజి గంగారాం, చంద్రశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లీంలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



జక్రాన్‌పల్లిలో..



డిచ్‌పల్లి ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వర్ని మండల కేంద్రంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



కొండాపూర్‌లో ప్రార్థనలు చేస్తున్న మైనార్టీలు



కందకుర్తిలో..



ఎడపల్లిలో..



నాగేంద్రనగర్‌లో..



కోటగిరిలో..

అందరి సహకారంతో సహకార సంఘం అభివృద్ధి

● హున్స సొసైటీ చైర్మన్ మందర్నా రవి



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్

బోధన్‌రూరల్,మార్చి31(ఆంధ్రజ్యోతి): సహకార సంఘ సభ్యుల సమిష్టి సహకారంతో సహకార సంఘం అభివృద్ది బాటలో పయనిస్తుందని హున్స ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మందర్నా రవి అన్నారు. సోమవారం సంఘ ఆవరణలో మహజన సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి హన్మంత్ రావు 2023-24, 2024-25 అర్ధ వార్షిక నివేదికను, ఆడిట్ నివేదికను సభలో చదివి వినిపించారు. సభలో ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సహకార సంఘం పరిధిలో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు కోరారన్నారు. అలాగే ఎరువుల ధరల విషయంలో సాలూర సహకార సంఘం అధికారులతో మాట్లాడి ప్రతిఒక రైతుకు ప్రభుత్వం అందించే ధర ప్రకారమే ఎరువులను విక్రయించే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం కార్యదర్శి హన్మంత్ రావు, వైస్ చైర్మన్ వినోద్ కులకర్ణి, డైరెక్టర్లు రమేష్, అశోక్, మాధవరావు, గంగన్న, మన్నే భూమన్న, కేశ్‌పేట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

వేల్పూర్ , మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాపూర్‌లో సీసీ రోడ్డు పనులను గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేంపల్లి ఇంద్రగౌడ్, లింగగౌడ్, దేవల నవీన్, మహేందర్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్ : డొంకేశ్వర్ మండల కేంద్రంలో సోమవారం సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు ప్రారంభించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సహకారంతో గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలు మంజూరు చేయించగా వాటితో సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారన్నారు. కార్యక్రమంలో మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, కల్లెం సంతోష్, సాగర్, సాయన్న, శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో జారిపడి ఒకరి మృతి



మచ్చ మహేంధర్ మృతదేహం

జక్రాన్‌పల్లి, మార్చి31 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన మచ్చ మహేందర్ (48) మృతిచెందినట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం మచ్చ మహేందర్ స్కూటీపై ఇంటినుంచి బయటకు వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదని, అతని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ ఉండడంతో అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు వెతుకుతుండగా సోమవారం ఊర చెరువు నీటిలో అతను మృతిచెంది ఉన్నాడని ఎసై తెలిపారు. మృతుని భార్య మచ్చ రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య మచ్చ రజని, కొడుకు, కూతురు ఉన్నారని ఎస్సై తెలిపారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



108లో క్షేమంగా ఉన్న తల్లీబిడ్డలు

బోధన్‌రూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): బోధన్ నుంచి 108వాహనంలో మహిళ ప్రసవించింది. రెండో కాన్పు కోసం జిల్లా కేంద్రం తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది ఉన్నతాధికారుల సూచనల మేరకు వాహనాన్ని ఆపి సాధారణ కాన్పు నిర్వహించారు. దీంతో సాలూర మండలానికి చెందిన ఫాతిమా బేగంకు రెండవ కాన్పులో పండంటి ఆడబిడ్డ జన్మించిందన్నారు. బోధన్‌లో రక్తం తక్కువగా ఉందని వైద్యులు జిల్లా కేంద్రానికి పంపడంతో మార్గమధ్యలోనే సాధారణ కాన్పు కావడం, పండంటి ఆడబిడ్డ జన్మించడంతో కుటుంబ సభ్యులు 108సిబ్బంది లక్ష్మీ, నరేష్‌లను అభినందించారు. అనంతరం తల్లి, బిడ్డలను జిల్లా ఆసుపత్రికి తరలించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఆర్మూర్ రూరల్, మార్చి31(ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలోని మహాత్మజ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. గణితం, జువాలజీ , కెమిస్ట్రీ, కామర్స్, బొటని, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన మహిళ అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 2వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో మునిపల్లిలోని కళాశాలలో ఇంటర్వ్యూ, డెమోకు హాజరు కావాలని కోరారు.

'యూనివర్సిటీ భూముల అమ్మకాలు నిలిపి వేయాలి'

ఆర్మూర్ టౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాలను నిలిపివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశాడు. సోమవారం పట్టణంలోని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 15 వందల ఎకరాల వరకు ఉందని అందులో ఉన్న 400 ఎకరాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం సిగ్గు చేటన్నారు. అమ్మకాలను ఆపాలని పోరుబాట పడిన విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని అన్నారు. రేవంత్ సర్కారు ప్రభుత్వ విద్యను నాశనం చేయడానికి చూస్తుందని రాబోవు రోజుల్లో తెలంగాణను కూడా అమ్మేస్తుందని ఇలాంటి విధానాన్ని మార్చుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏరియా ప్రధాన కార్యదర్శి మమత, సహాయ కార్యదర్శి సద్దు, సచిన్, శివ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నాగంపేట్ వెంకన్న బ్రహ్మోత్సవాలు

ముప్కాల్ , మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంపేట్ గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రెండోరోజు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాల్లో ఉత్సవమూర్తులను ఎదుర్కోలు నిర్వహించి కల్యాణ మండపంలో ఘనంగా కల్యాణం నిర్వహించారు. సోమవారం ఉత్సమూర్తులను గంగానది తీసుకెళ్లి గంగ జలాలతో అభిషేకం నిర్వహించి, అర్చన, అభిషేకం, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు.


'మహనీయుల జయంతిని విజయవంతం చేయండి'

బోధన్‌రూరల్,మార్చి31(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్‌డివిజన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 30న మహనీయుల జయంతిని ఏర్పాటు చేశామని ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ కన్వీనర్ నీరడి ఈశ్వర్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాండు, నీరడి రవి, దేవేందర్ పాల్గొన్నారు.

ఫటా.. ఫట్...

విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రత్యేక కృషి

● కమ్మరి రమేష్, మానవతాసదన్ కేర్ టేకర్, డిచ్‌పల్లి



నిజామాబాద్ జిల్లా అప్పటి జిల్లా కలెక్టర్ ప్రస్తుత విద్యాశాఖ కమిషనర్ యోగితారాణా ప్రత్యేక కృషితో డిచ్‌పల్లిలో నెలకొల్పిన మానవతా సదన్ విద్యార్థులకు విద్యలో రాణిస్తున్నారు. పదేళ్ల క్రితం నెలకొల్పిన ఈ సదన్ విద్యార్థిని విద్యార్థుల అభ్యున్నతి కోసం ఇటు ప్రభుత్వం, అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చేయూతనందిస్తూ ముందుకు సాగిస్తున్నారు. మానవత సదన్ విద్యార్థులు ప్రస్తుతం బీటెక్, నర్సింగ్ కోర్సులతో పాటు ఉన్నత విద్యాభ్యాసంలో కూడా రాణిస్తూ పలువురు ప్రశంసలు అందుకుంటున్నారు. నా అనే వారు లేని ఈ మానవత సదన్ విద్యార్థులు విద్యాభ్యాసంలో ముందుకు సాగుతూ ఒక వెలుగు వెలుగుతున్నారు.

ఆంధ్రజ్యోతి: మానవత సదన్‌లో ఎంత మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు?

సదన్ ఇన్‌చార్జి: ప్రస్తుతం మానవత సదన్‌లో 152 మంది విద్యార్థిని విద్యా ర్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. వీరి అభ్యున్నతి కోసం ప్రత్యేక శ్రద్ద చూ పుతున్నాం.

ఆంధ్రజ్యోతి: ఏఏ తరగతి విద్యార్థులు ఎంత మంది ఉన్నారు?

సదన్ ఇన్‌చార్జి: ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థిని విద్యార్థులు డిచ్‌పల్లి మండల కేంద్రంలో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఇంటర్ నుంచి డిగ్రీ వరకు, పాలిటెక్నిక్, బీఈడీ విద్యార్థులు వివిధ ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇప్పటి వరకు పాలిటెక్నిక్‌లో 15 మంది, బీఈడీలో 4, కేజీబీవీలో 6 విద్యార్థిని విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఇందల్వాయి టోల్‌గేట్ ప్రతినిధులు సదన్‌కు ఎలాంటి చేయూతనందిస్తున్నారు?

సదన్ ఇన్‌చార్జి: మానవతా సదన్‌లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థిని విద్యార్థుల కోసం టోల్‌గేట్ యాజమాన్యం స్టడీ హాల్‌తో పాటు 20 టాయిలెట్స్ రూ.30లక్షల నిర్మాణంతో పనులు చేపట్టారు. ఇప్పటికే పనులు 90 శాతం వరకు పూర్తయ్యాయి. అంతేకాకుండా విద్యార్థిని విద్యార్థుల భోజ నం కోసం డైనింగ్ టేబుళ్లను కూడా సదన్‌కు అందజేశారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థులకు వైద్య పరీక్షలు ఎన్ని రోజులకొకమారు చేయిస్తున్నారు?

సదన్ ఇన్‌చార్జి: సదన్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వారానికి రెండు మార్లు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయిస్తున్నాం. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: విద్యార్థుల బోధన కోసం స్టడీ మెటీరియల్స్ ఉన్నాయా?

సదన్ ఇన్‌చార్జి: జిల్లా విద్యాశాఖ అధికారుల సూచన మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు విద్యార్థుల అభ్యున్నతి కోసం స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాం.

● (డిచ్‌పల్లి, ఆంధ్రజ్యోతి)



చూడముచ్చటగా ఉన్న నైజాం కాలం నాటి అతిథి గృహం



వీఐపీ గార్డెన్‌లో నీరు లేని ఫౌంటైన్ ఇదే



గార్డెన్‌లో వెలగని ఐమాస్ట్ లైట్లు



ఎండిపోయిన వీఐపీ గార్డెన్ ఇదే

కళావిహీనంగా అతిథి గృహం

- నిరుపయోగంగా మారిన ఫౌంటైన్లు
- ఎండిపోయిన వీఐపీ గార్డెన్
- ప్రభుత్వాలు మారుతున్నా కన్నెత్తి చూడని పాలకులు, అధికారులు

నిజాంసాగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆనాడు రాష్ట్ర రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న నిజాంసాగర్ వీఐపీ అతిథి గృహాలు కాలక్రమేనా అధికారులు పాలకులు మారుతూ ఉన్నప్పటికీ నిజాంసాగర్ వీఐపీ అతిథి గృహం.. వేస్ట్ హౌస్‌గా మారింది. ఆనాడు లక్షల రూపాయలు ఖర్చు చేసి నైజాం ప్రభుత్వంలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణ దశకు ముందుగానే 1921లో నిజాంసాగర్ ప్రాజెక్టు పరిసరాల ప్రాంతంలో దాదాపు పది ఎకరాల స్థలాల్లో వీఐపీ అతిథి గృహాలను నిర్మాణం చేసి 1932లో జాతికి అంకితం చేశారు. అప్పట్లో ఎంతో కనువిందు చేసే విధంగా ఉండేవి 1990 వరకు చూడముచ్చటగా ఉన్న ఈ అతిథి గృహాల నిర్వహణ కోసం ఎలాంటి నిధులు కేటాయించక పోవడంతో నీటి పారుదల శాఖ అధికారులు వీటిని నిర్వహణ తమ కేమీ పట్టనట్లుగా ఉండేవారు. 1996లో నిజాం కాలం నాటి అతిథి గృహాన్ని నక్సల్స్ పేల్చివేయడంతో అతిథి గృహం సగభాగం పూర్తిగా ధ్వంసం అయింది. అప్పట్లో అధికార యంత్రం నైజాం కాలం నాటి అతిథి గృహాన్ని సగభాగం తొలగించి 2004 10 లక్షల రూపాయల వ్యయంతో సగభాగం అతిథి గృహం స్థానంలో రెండు సూట్లు విశాలమైన హాల్ నిర్మాణం చేసి జాతికి అంకితం చేశారు. 2004 నుంచి 10 ఏళ్లపాటు ఈ గెస్ట్ హౌస్ ఎంతో ముచ్చటగా ఉండేది 2013లో సమైక్యాంధ్ర కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మరో 90 లక్షల రూపాయలను కేటాయించారు. ఈ నిధులతో నిజాం కాలం నాటి అతిథి గృహానికి పునర్నిర్మాణం చేశారు. అతిథి గృహంలో అన్ని కనీస సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు. 2021లో తెలంగాణ ప్రభుత్వ హయాంలో లక్షల రూ పాయలు వచ్చింది ఈ అతిథి గృహాలకు ఫర్నిచర్‌తో పాటు ఏసీలను కూడా ఏర్పాటు చేశారు అప్పట్లో తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యవేక్షించేందుకు అధికార యంత్రాంగం ఖరారు చేశారు. అప్పట్లో అతిథి గృహాలు వీఐపీ గార్డెన్‌లో పర్యాటక గార్డెన్‌లో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి తుది మెరుగులు దిద్దారు. అప్పట్లో ముఖ్యమంత్రి పర్యటన రద్దు కావడంతో నాగమడుగు ఎత్తిపోతల పథకానికి అప్పటి ఐటీ మంత్రి తారక రామారావు శంకుస్థాపన చేసేందుకు విచ్చేశారు. అతిథి గృహాలు గార్డెన్లు ఎంతో సుందరంగా తీర్చిదిద్దిన వాటిని పునర్ ప్రారంభించలేక పోయారు. నిజాంసాగర్ నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ కార్యాలయం పక్కనే ఉన్న అతిథి గృహం పైన పటారం లోన లొటారం అనే చందంగా మారింది. లక్షల రూపాయలు ఖర్చు చేసిన ఫ్యాన్లు, ఏసీలు, విద్యుత్ దీపాలు మున్నాలకే పాడై పోయాయి. అధికారులు ఈ అతిథి గృహం పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తూనే ఉన్నారనేందుకు ఇదే నిదర్శనం అతిథి గృహం దాదాపు పది ఎకరాల స్థలంలో పచ్చని చెట్ల మధ్యన కనువిందు చేసే విధంగా ఉన్న వాటిని పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అతిథి గృహానికి వచ్చే వీఐపీలకు కనువిందు చేసే విధంగా ఉన్న స్వాగత తోరణం.. కళా విహీనంగా మారినా ప్రజా ప్రతినిధులు సైతం నోరు మెదప కుండా ఉన్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అతిథి గృహం ముందు భాగంలో వీఐపీ గార్డెన్‌తో పాటు పిల్లాపాపలు సేద తీర్చుకునేందుకు ఉన్న ఫౌంటైన్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికే గార్డెన్ అంతా ఎండిపోయింది. ఆనాడు పచ్చని చెట్ల మధ్యన ఉండే గార్డెన్‌లోనే పర్యాటకులు వీఐపీలు సేద తీర్చుకునేవారు కాలక్రమేన ఈ అతిథి గృహం వేస్ట్‌గా గృహంగా మారుతూ ఉండడంతో ఆనాటి నైజాం కలలను సహకారం చేశారా..? నైజాం కలలను కనుమరుగు చేసేరా అనేది ప్రశ్నగా మారింది. ప్రభుత్వాలు పాలకులు మారుతున్న నిజాంసాగర్ అతిథి గృహాల గార్డెన్‌లను నిర్వహణ చేసేందుకు నిధులు కేటాయించకపోవడంతోనే ఇవి కనుమరు గవుతున్నాయని చెప్పవచ్చు. ఆనాడు నైజాం ప్రభుత్వం మంజీరా నది పైన నిజాంసాగర్ ప్రాజెక్టును నిర్మాణం చేసి అప్పట్లో రెండు లక్షల 75 వేల ఎకరాలకు సాగు నీరు అందించి ఉమ్మడి జిల్లా నిజామాబాద్‌కు ధాన్యాగారంగా కీర్తి తెచ్చిన ఘనత నైజాం నవాబులదేనని చెప్పవచ్చు. ఈ ప్రాజెక్టు కింద దాదాపు 324 గ్రామాల రైతులు సిరులు పండించుకుంటూ ఉండడం విశేషం. ప్రభుత్వాలు పాలకులు మారుతున్నా నిజాంసాగర్ వీఐపీ అతిథి గృహాలపై గార్డెన్లపై సవతి ప్రేమ అవలంబిస్తున్నారని ఉభయ జిల్లాల వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారం స్పందించి అతిథి గృహాల నిర్వహణ కోసం నిధులు కేటాయించడంతో పాటు సిబ్బందిని నియమించి పూర్వ వైభవం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఎండిపోయిన స్వాగత తోరణం ఇది

సిద్ధరామేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి



భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భిక్కనూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలో సోమవారం భక్తుల తాకిడి నెలకొంది. సెలవు దినం కావడంతో ఉదయం నుంచే ఆలయానికి జిల్లా నలుమూలలతో పాటుగా మెదక్ జిల్లాకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదా వితరణ చేశారు. కాగా ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అభిషేకాలు, సత్య నారాయణ వ్రతాలు నిర్వహించగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



ఖాళీ బకెట్లతో మహిళలు



పనిచేయని బోరు మోటారు

- 14 నెలల నుంచి ఇక్కట్లు
- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ఇందల్వాయి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. వేసవి దృష్ట్యా జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పదే పదే అధికారులకు చెబుతున్నా మండల స్థాయి అధికారులు సరిగా పట్టించుకోవడం లేదు. దీంతో పలు గ్రామాల్లో తాగునీరు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాళీ బిందెలతో నిరసన చేపడుతున్నారు.

14 నెలల నుంచి నీళ్లు లేవు

మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో ఐదో వార్డులో తాగడానికి నీళ్లలేక కాలనీవాసులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 14 నెలల నుంచి ఐదో వార్డులో బోరుమోటారు చెడిపోయింది. దీంతో కాలనీ వాసులు పలుసార్లు పంచాయతీ సిబ్బందికి తెలియజేసిన పట్టించుకున్న పాపాన పోలేదు. 14 నెలల నుంచి తాగునీటితో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీ బిందెలతో నిరసన

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ తాగునీరు పల్లె ప్రజలకు సరిగ్గా అందడం లేదు. ఇందల్వాయిలో గత 14 నెలల నుంచి బోరుమోటారు చెడిపోయిన పంచాయతీ సిబ్బందికి తెలియజేసిన బోరు మరమ్మతులు చేపట్టకపోవడంతో మేము ఏ నీరు తాగాలని కాలనీవాసులు ఖాళీ బిందెలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇందల్వాయిలోని ఐదో వార్డులో బోరు మోటారు మరమ్మతులు చేపట్టి తాగు నీరు అందించాలని అధికారులను కోరుతున్నారు.

14 నెలల నుంచి నీళ్లు లేవు

● రిహానాబేగం, ఇందల్వాయి



గత 14 నెలల నుంచి బోరు మోటారు చెడిపోయింది. అధికారులకు చెప్పిన మరమ్మతులు చేయలేదు. ఎండాకాలం వచ్చిన స్పందన లేదు. మేము ఏ నీళ్లు తాగాలి.

తాగునీటి సమస్య తీర్చాలి

● సత్తెవ్వ, ఇందల్వాయి



ఇందల్వాయి గ్రామంలోని ఐదో వార్డులో తాగు నీటి సమస్యను అధికారులు తీర్చాలి. 14 నెలలు అయినా బోరుమోటారును పట్టించుకోకపోతే మేము ఎట్లా బతకాలి. అధికారులు స్పందించాలి.



శెట్‌పల్లిలో శిథిలావస్థలో వున్న భవనం

శిథిలావస్థలో సహకార సంఘ భవనం

మోర్తాడ్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం పూర్తిగా చెడిపోయింది. భవనంలోని సగభాగం పగుళ్లు ఏర్పడింది. పైనుంచి పెచ్చులు ఊడి పడుతుండడంతో ఉద్యోగులు సగ భాగంలోని విధులు నిర్వహిస్తున్నారు. సగ భాగం కులుతుందన్న భయంతో తాళం వేసి ఉంచుతున్నారు. ఈ సహకార సంఘం పరిధిలో ధర్మోరా, శెట్‌పల్లి, దొన్కల్, తొర్లి గ్రామాలున్నాయి. అన్ని గ్రామాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేందుకు గోదాంలు నిర్మించారు. ఈ సొసైటీలో 1540మంది సభ్యులున్నారు. సొసైటీ ద్వారా రైతులకు రుణాలు అందజేశారు. ప్రతీ సంవత్సరం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. రైతులకు అన్ని రకాల సేవలందిస్తున్న సొసైటీని అధికారులు పట్టించుకోవడం లేదు. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. కొత్త భవనం నిర్మించేందుకు అధికారులు నిధులు మంజూరు చేసి సహకరించాలని రైతులు కోరుతున్నారు.

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం

● మోత్కూరి నారాయణగౌడ్, కార్యదర్శి



శిథిలావస్థకు చేరిన సొసైటీ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో నిధులు మంజూరు అయ్యే అవకాశం ఉంది.





రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు, చిన్నారులు



ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు

ఆనందోత్సాహాలతో రంజాన్ వేడుకలు

● ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు ● ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు అధికారులు



సీపీని సన్మానిస్తున్న మైనారిటీ నాయకుడు



ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు

నిజామాబాద్ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. సోమవారం గ్రామాలు మొదలుకొని మండల, పట్టణ, జిల్లా కేంద్రాలలో ఈద్గాల వద్ద ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నెలరోజుల కఠిన ఉపవాస దీక్షలు పాటించిన ముస్లింలు నెల రోజుల తర్వాత నెలవంక దర్శనం ఇవ్వడంతో ఉపవాసాలు విడిచి పండుగను జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని ముస్లింలు కొత్త వస్త్రాలు ధరించి ఉదయం నుండే ఈద్గాలకు పయనమయ్యారు. ఈద్గాల వద్ద ప్రపంచ శాంతిని కోరుకుంటూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెలరోజుల ఉపవాస దీక్షలో ముస్లింలు దైవ చింతన ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఐదు సార్లు నమాజ్ చేయడం దైవ అనుగ్రహం లభిస్తుందని మత పెద్దలు బోధించారు. ముస్లింలు తాము ప్రతీరోజు నిర్వహించే ప్రార్థనలో ప్రపంచ శాంతి ఆనందం పాడిపంటలతో ఉండాలని కోరుకుంటారని అన్నారు. ప్రతీరోజు చేసే పనులతో పాటు ఏడాది పొడవున దైవ, సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉదయం ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. పలు ప్రాంతాల్లో ఈద్గాలతో పాటు మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలు చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ఒకరికొకరు ఆలయ్ బలయ్ చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కల వారితో కలిసి విందులు, వినోదాలతో సందడి చేశారు.

ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఉర్దూ అకాడమి చైర్మన్

జిల్లా కేంద్రంలోని ఖిల్లా ఈద్గా ప్రాంతంలో జరిగిన ప్రార్థనలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లింలను ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దేశ వ్యాప్తంగా ముస్లింలు పరమ పవిత్రంతో ప్రార్థనలు చేసి పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. నెలరోజుల ఉపవాస దీక్ష దేవుడి కరుణ కోసమేనని అల్లా అందించిన పవిత్ర గ్రంథమైన ఖురాన్ మార్గదర్శనం అన్నారు. ఈద్గా వద్ద జరిగిన వేడుకల్లో నుడా చైర్మన్ కేశ వేణు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నరాల రత్నాకర్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ రెడ్‌కో చైర్మన్

రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్గాల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొని మాజీ రెడ్‌కో చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు అలీమ్, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు దైవ కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ముందుకు సాగడం ఆనందంగా ఉందన్నారు. ముస్లింలకు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్యప్రకాష్ ఉన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులతో నిరసన...

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలో వక్ఫ్ బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులతో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డు చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకొని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ఇంటికి వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మైనార్టీ చైర్మన్ తారిక్ అన్సారీని సీపీ సాయి చైతన్య కలుసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన రూరల్ ఎమ్మెల్యే



తాహెర్‌బిన్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్‌అర్బన్,మార్చి 31(ఆంధ్రజ్యోతి):రంజాన్ పండుగ శుభ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. బోర్గాం(పి) సంజీవరెడ్డి కాలనీలోగల ఆయన నివాసానికి వెళ్లి ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నివాసంలో భోజనం చేశారు. ఆయన వెంట గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మల్లికార్జున దేవాలయంలో కోటి తలంబ్రాల దీక్ష



తలంబ్రాల దీక్షలో పాల్గొన్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):భద్రాద్రి రామాలయంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి ఉపయోగించే తలంబ్రాలను మల్లికార్జున దేవాలయంలో కోటి తలంబ్రాల దీక్షను నిర్వహించారు. సోమవారం నగరంలోని మల్లికార్జున దేవాలయంలో భక్తులు వడ్లను గోటితో ఒలిచి తలంబ్రాలను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకోటి భక్త సమాజ సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ గత వారం రోజులుగా జిల్లాలో పలు ప్రాంతాల్లో కోటి తలంబ్రాల దీక్షను చేపట్టి తలంబ్రాలను రామ కల్యాణానికి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు.

జక్రాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



అర్గుల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్

జక్రాన్‌పల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ గ్రామంలో సింగిల్ విండో పరిధిలో గల జక్రాన్‌పల్లి, అర్గుల్, పడకల్, కేశ్‌పల్లి గ్రామాలలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించుకొని ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ అప్పాల నడ్పి రాజన్న, సర్పంచ్‌ల ఫోరం సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్, మండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, విండో కార్యదర్శి తిరుపతి రెడ్డి, విండో డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు రైతులు పాల్గొన్నారు.

ధర్పల్లి: రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామడుగు సింగిల్ విండో చైర్మన్ రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రామడుగు, మైలారం గ్రామాల్లోసింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యంకొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ప్రభుత్వం మద్దతు ధర లభిస్తుందన్నారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. సన్నధాన్యానికి ఇప్పటికే రైతుల ఖాతాలో రూ.500 బోనస్ జమ అయిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో ప్రవీణ్ రెడ్డి, రైతులు, డైరెక్టర్లు, సింగిల్ విండో సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ: సిరికొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధ్యక్షుడు చెల్లెం గంగాధర్ సోమవారం ప్రారంభించారు.మండలంలోని రావుట్ల గ్రామంలో రైతుల సమక్షంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడం వల్ల మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు ప్రభుత్వం రూ.ఐదు వందల బోనస్ చెల్లిస్తుందని గంగాధర్ చెప్పారు.కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోవడం వల్ల రైతుకు లాభమే జరుగుతుందన్నారు. దళారులను నమ్మితే నష్టం వాటిల్ల వచ్చన్నారు.ధర తక్కువ కావచ్చు సమయానికి డబ్బులు అందక పోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బాబన్న, రమేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్ల ఎర్రన్న,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బాబురావు,గణేష్,రాజేంద్రప్రసాద్, భాస్కర్,వీఏసీఎస్ కార్యదర్శిగిరిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువ వేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, మార్చి31(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ తెలంగాణకు శ్రీరామరక్ష అని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు.బీఆర్ఎస్ పార్టీలో సోమవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు చేరగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని అడుగడుగున నిలదీస్తామన్నారు.బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్, భీమ్‌గల్ తాజామాజీ కౌన్సిలర్ బోర్ల లింగం, సికింద్రపూర్ పెద్దమ్మకాడి తాండ, సర్పంచ్ రమేష్ తన అనుచరులతో పార్టీలో చేరారు. మోర్తాడ్ మండల కాంగ్రెస్ నాయకులు తక్కూరి రంజిత్ కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శిగా రాథోడ్ గోవింద్

నవీపేట,మార్చి31(ఆంధ్రజ్యోతి): భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) మండల కార్యదర్శిగా రాథోడ్ గోవింద్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం నవీపేటలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. విద్యార్థి రంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్, మండల అధ్యక్షుడు కరణ్, మనోజ్, అరవింద్, సాయికుమార్, వినోద్ తదితరులున్నారు.

జిల్లా ప్రజలు నిబంధనలను పాటించాలి



నగరంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

నిజామాబాద్ అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రజలు ఈ దిగువ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించరాదని ముఖ్యంగా జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు వంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయవద్దన్నారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ యొక్క అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయరాదని ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డేసీగర్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 నుంచి ఉదయం 6గంటల వరకు డీజేల సౌండ్ సిస్టమ్ పూర్తిగా నిషేదం అని, డీజేలకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాల న్నారు. ఊరేగింపసులు, బహిరంగ సభలకు పరిమితులకు మించిన ధ్వని శబ్ధం ఉత్పత్తి చేసే డీజేలు, సౌండ్ సిస్టమ్‌లు కమీషనరేట్ పరిధిలో నిషేదం ఉందన్నారు. ఎవరైనా సభలు, సమావేశాలు, జనసంచార ప్రాంతాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని, 500 మందితో కూడిన సమావేశాలు, సభలు నిర్వహిస్తే సంబంధిత ఏసీపీ నుంచి తప్పనిసరిగా 72 గంటల ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం తప్పనిసరిగా సెక్యూరిటీ నిబంధనలు పాటించాలన్నారు. డ్రోన్‌ల వాడకం వల్ల ఎక్కువ ప్రమాదాలు పొంచిఉన్న నేపథ్యంలో డ్రోన్‌ల వాడకానికి తప్పనిసరిగా ప్రభుత్వ సంస్థలు, పోలీసు, ఏవియేషన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గల్ఫ్ ఏజెంట్లు అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని కావున గల్ఫ్ ఏజెంట్లకు ప్రజలు ఇళ్లు అద్దెకు ఇచ్చేముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అటువంటి వారు అద్దెకు వస్తే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. జిల్లాలో ఏ సర్టిఫికెట్ పొందిన సినిమాలను మైనర్లు చూడడానికి థియేటర్లకు అనుమతించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీధుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరమైన వికృత, అసభ్యకరమైన ప్రవర్తనను ప్రదర్శిస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయని కావున బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశామన్నారు. పైన తెలియజేసిన నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నిబంధనలు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు అమల్లో ఉంటాయని సీపీ తెలిపారు.

● బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన సీపీ

రంజాన్ పండుగ సందర్భంగా నగరంలో పికెట్స్, బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ డైవర్షన్ సోమవారం సీపీ సాయిచైతన్య పర్యవేక్షించారు. నగరంలోని ఐదవ టౌన్ పరిధిలోగల శాంతినగర్ ఈద్గా ప్రార్థన స్థలంలో బందోబస్తు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం వన్‌టౌన్ పీఎస్ పరిధిలో ఖిచ్చియ మసీద్ వద్ద పికెట్‌ను తనిఖీ చేసి ట్రాఫిక్ డైవర్షన్‌ను పరిశీలించారు. శంభునిగుడి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్, పికెట్‌ను తనిఖీ చేశారు. రెండవ టౌన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఆయన వెంట అదనపు పోలీస్ కమీషనర్ బస్వారెడ్డి, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కేంద్రం వక్ఫ్‌బోర్డును వెనక్కి తీసుకోవాలి



ఈద్గా వద్ద మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

బోధన్‌రూరల్,మార్చి31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని బోధన్‌లో ముస్లిం, మైనారిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రంజాన్ పండుగ పర్వదిన సందర్భంగా ఈద్గాలో నమాజ్ సమయంలో చేతులకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మైనారిటీ, ఎంఐఎం పార్టీ నాయకులు అబ్దుల్ సమీ మాట్లాడుతూ కేంద్రం వక్ఫ్‌బోర్డు బిల్లు తేవడం సరికాదన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు అన్ని విధాలుగా మైనారిటీ సంక్షేమం కోసం చూసుకుంటుందన్నారు. ఇది మా ఆస్తి అని దీనిని రద్దు చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న ముఖ్యమంత్రులు చంద్రబాబు, నితీష్ కుమార్‌లు బిల్లుకు సహకరించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ముఖీం, ఇలియాజ్, జాకీర్ హుస్సేన్, అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు.

బట్టాపూర్‌లో సేవాలాల్ మహరాజ్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న గిరిజన భక్తులు

ఏర్గట్ల,మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బట్టాపూర్ గ్రామంలోని గిరిజనతండాలో సోమవారం గిరిజనుల ఆరాధ్య దైవమైనసంత్ సేవాలాల్ మహరాజ్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవలాల్ మాలాధారణ వేసుకొని జగదాంబ మాతను,సేవలాల్ మహరాజ్‌ను పూజించడం, బోగ్ బండార్ నిర్వహిం చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్య శ్రీనివాస్, శివ, హరి, రాజేష్ నాయక్, తిరుపతి, గిరిజన మహిళ భక్తులు, తండా వాసులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో జిల్లా నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లాలో బీజేపీ పార్టీ అభివృద్ధికి పలు అంశాలపై మాట్లాడారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమై 15 రోజులు అవుతున్నా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం మీనమేశాలు లెక్కపెడుతుందని వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. నగరంలోని అర్సపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఆలస్యం వలన మార్కెట్‌లో దళారులు, వ్యాపారస్తులు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను నష్టాల్లోకి నెట్టి వేస్తున్నారని అన్నారు. ఎంఎస్‌పీకి మద్దతు ధరలు రైతులకు అండగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే సంస్థలో పీఏసీసీఎస్, ఐకేపీ, ఎఫ్‌సీఐ, డ్వాక్రా సంఘాల ద్వారా అమ్మకపోతే రైతులకు బోనస్ అవకాశం కూడా రాకుండా పోతుందని అన్నారు. దీంతో పాటు బస్తాకు 2 నుంచి 5 కిలోల తరుగు పేరుమీద కట్ చేస్తున్నారని దీనివల్ల రైతులు దళారులు, వ్యాపారస్తుల చేతుల్లో నిలువు దోపిడికి గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తగినన్ని కొనుగోలు కేంద్రాలను జిల్లా అంతటా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని రకాల ధాన్యానికి రూ.500ల బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామన్నారు. ప్రభుత్వం రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు కొనుగోలు కేంద్రాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయక్వాడి నర్సయ్య, సాయిలు,గోపాల్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కోఆర్డినేటర్ల నియామకం

నిజామాబాద్ అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీ నుంచి 11 వరకు నిర్వహించనున్న రాజ్యాంగ పాదయాత్రకు జిల్లాలో కోఆర్డినేటర్లను నియమించినట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాలకు రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్‌ను, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాలకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డిని, నిజామాబాద్ అర్బన్, బాన్సువాడ నియోజకవర్గాలకు పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్‌లను కోఆర్డినేటర్లుగా నియమించినట్లు ఆయన తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్,మార్చి31(ఆంధ్రజ్యోతి): సాలూర మండల కేంద్రానికి చెందిన కుమ్మరి నాగేష్(40) అనే వ్యక్తి గత కొంతకాలంగా మద్యానికి బానిసై అప్పులు పెరిగి ఇంట్లో గొడవలు పడే వారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం నాగేష్ భార్య జ్యోతి గొడవ పడి పుట్టింటికి వెళ్లి వారం అయిందన్నారు. అప్పుల బాధతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని రూరల్ ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

ఊట్‌పల్లిలో..

బోధన్‌రూరల్: బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన నరేష్(45) అనే వ్యక్తి తన తండ్రిని చంపినందుకు గతంలో జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చాడని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. జైలు నుంచి వచ్చిన తర్వాత తాగుడుకు బానిసై దొంగతనాలు చేసేవాడన్నారు. ఆదివారం మనస్తాపానికి గురై ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

అలహాబాద్‌లో జిల్లా విద్యార్థి ఆత్మహత్య

● హాస్టల్ భవనం పై నుంచి దూకిన రాహుల్ చైతన్య



రాహుల్ చైతన్య (ఫైల్)

నిజామాబాద్ అర్బన్/వర్ని,మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఐఐటి విద్యార్థి ఎం.రాహుల్ చైతన్య(20)అల హాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. వర్ని మండలం సత్యనారాయణపురంకు చెందిన స్వర్ణలత - కృష్ణప్రసాద్ దంపతుల కుమారుడైన రాహుల్ చైతన్య అలహాబాద్ ఐఐటిలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ప్రయాగరాజ్‌లోని ఐఐటి హాస్టల్ భవనం ఐదవ అంతస్తు మీద నుంచి దూకి రాహుల్ చైతన్య ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. మొదటి సంవత్సరంలో బ్యాక్‌లాగ్ ఉండటం వల్ల మనస్థాపనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు తెలిపారు. డెఫ్ అండ్ డమ్ అయిన రాహుల్ జేఈఈమెయిన్స్‌లో 52వ ర్యాంకు ఈడబ్ల్యుఎస్ కేటగిరిలో సాధించి గత ఆగస్టు నెలలో కళాశాలలో చేరాడు. కళాశాలలో చేరినప్పటి నుంచి తమకు ఫోన్ కూడా చేయలేదని తల్లిదండ్రులు తెలిపారు. బ్యాక్‌లాగ్ ఉండటం వల్ల గత ఆరు నెలలుగా చైతన్య కళాశాలకు వెళ్లడం లేదు. కళాశాల లో డెఫ్ అండ్ డమ్ కింద ప్రత్యేక లెక్చరర్ల ద్వారా తరగతులు నిర్వ హించాల్సి ఉన్నా అలాంటివి ఏవి నిర్వహించకపోవడం వల్లే తమ కొడుకు ఆత్మహత్యకు పాల్పడినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రాహుల్ తండ్రి సత్యనారాయణపురంలో చిన్న హోటల్ నిర్వహిస్తుం డగా, తల్లి గృహిణి. చివరి సారిగా చనిపోయే ముందు రాహుల్ తల్లి స్వర్ణలతకు వీడియోకాల్ చేశాడు. వీడియోకాల్ లిఫ్ట్ చేయకపోవడం తో తాను చనిపోతున్నట్లు మెస్సేజ్ చేశాడు. తండ్రి, తమ్ముడిని జాగ్ర త్తగా చూసుకోవాలని మెస్సేజ్ పెట్టినట్లు తల్లి స్వర్ణలత తెలిపింది.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి):హెచ్‌సీయూ భూముల వేలాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గిరిరాజ్ కళాశాల వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేసిన పీడీఎస్‌యూ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ తెలిపారు. హైదరా బాద్‌కు జీవన వైవిధ్యంగా, ప్రజలకు ఆక్సీజన్‌గా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముకుంటుందని విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల భూములను అమ్ముకోవడం సరికాదన్నారు. విద్యార్థి సంఘ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేసి వారిని విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్, సాయి, రాజు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

'వడ్లను ఏ రైస్‌మిల్‌కు కేటాయించారో అధికారులు బహిర్గతం చేయాలి'



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల సహకార సంఘం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం కొనుగోలు చేసిన వడ్లను ఏ రైతు వద్ద వడ్లు తీసుకొని ఏ రైస్ మిల్‌కు కేటాయించారో బహిర్గతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొనుగోలు చేసిన వడ్లను రైతులకు కేటాయించాల్సి ఉండగా వారి పేర్లను మార్చి వ్యక్తిగతంగా ఖాతాలో వేసుకోవడం జరిగిందన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ సహకార సంఘం అధ్యక్షుడు సిద్ధును వెంటనే సస్పెండ్ చేసి బోనస్ డబ్బులు తిరిగి ప్రభుత్వానికి అప్పచెప్పాలని ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులతో విచారణ నిర్వహించి దోషులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వై. ఓమయ్య, హన్మాండ్లు, సురేష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌లపై దుండగుల దాడి

● పోలీసులకు ఫిర్యాదు

ఎడపల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి): బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి బోధన్ వెలుతుండగా ప్రయాణికులను దింపుదామని దూపల్లి గేటు దగ్గర బస్సును ఆపిన వెంటనే, వెనుక నుండి బైకుపై వచ్చిన ఇద్దరు యువకులు బస్సు డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ప్రయాణికుల సమాచారం మేరకు ప్రయాణికులను దింపడానికి దూపల్లి గేటు దగ్గర బస్సు ఆపగానే బైకుపై వచ్చిన ఇద్దరు యువకులు బస్సు ముందు బైకును ఆపి డ్రైవర్ కిటికీ ఎక్కి విచక్షణా రహితంగా డ్రైవర్‌ను కొట్టి బస్సు తాళం లాక్కున్నారన్నారు. అంతటితో ఆగకుండా మరికొందరు ఆ వర్గానికి చెందిన వారు ఒక్కసారిగా గుంపుగా బస్సు దగ్గరికి రావడంతో రెచ్చిపోయిన ఆ ఇద్దరు దుండగులు బస్సు లోనికి ప్రవేశించి కండక్టర్‌ను కొట్టి క్యాష్ బ్యాగు లాక్కునే ప్రయత్నం చేశారని తెలిపారు. తాగిన మైకంలో ఉన్న ఆ దుండగులు బస్సులో ఉన్న ప్రయాణికులను సైతం బెదిరించారన్నారు. బోధన్ వస్తే మీ అంతు చూస్తామని డ్రైవర్, కండక్టర్‌లను బెదిరించారని ప్రయాణికులు తెలిపారు.


● దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశాం: ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి

బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి బోధన్ వెలుతుండగా దూపలిల గేటు వద్ద వెనుక నుండి బైకుపై వచ్చిన సల్మాన్, ముఖీద్ అనే యువకులు డ్రైవర్, కండక్టర్‌లపై దాడి చేశారని, బస్సు డ్రైవర్ శేఖర్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

బోధన్‌రూరల్,మార్చి31(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామం వైపు నుండి బోధన్ పట్టణానికి నడుచుకుంటూ వస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని 29 నాడు సాటాపూర్ నుంచి బోధన్ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న గోసే సంజీవ్ అనే వ్యక్తి అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చి ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని 108వాహనంలో బోధన్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మృతికి కారణమైన ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేశామన్నారు.


చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.210	రూ. 230



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.92,600	రూ.85,400	రూ.1055

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : సికిందర్ (హిందీ) (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్ర్కీన్-2 : మ్యాడ్ స్క్వేర్ (10.35, 1.20, 7.40, 10.25)
: ఎల్-2 ఎంపురాన్ (4.05)
స్ర్కీన్-3 : వీర ధీర (10.15)
: సికిందర్ (హిందీ) (1.35)
: మ్యాడ్ స్క్వేర్ (4.35)
: రాబిన్‌హుడ్ (7.20, 10.30)
స్ర్కీన్-4 : రాబిన్‌హుడ్ (10.00, 1.10, 4.20)
: వీరధీర (7.30)
: ఎల్-2 ఎంపురాన్ (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : మ్యాడ్ స్క్వేర్ (10.40, 1.20, 4.20, 7.20, 10.20)
స్ర్కీన్-2 : రాబిన్‌హుడ్ (10.50, 4.45, 7.30, 10.30)
: వీరధీర (1.35)
స్ర్కీన్-3 : సికిందర్ (హిందీ) (11.00, 1.40, 4.30, 7.30, 10.20)

లలితామహాల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : రాబిన్‌హుడ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సికిందర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మ్యాడ్ స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్